క్లుప్తంగా

వధూవరులకు ఆశీర్వాదం



ధరూరు: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డీఆర్ శ్రీధర్ కుమార్తె శ్రీయ, సూర్యతేజలను ఆదివారం మండల కేంద్రంలో వారి నివాసంలో మాజీ మంత్రి డీకే సమరసింహారెడ్డి ఆశీర్వదించారు. అదేవిధంగా ఉన్నత పాఠశాల స్థల దాతలు డీఆర్ వీరప్ప, రామలింగప్ప, సబ్బరాజు, బసన్నల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు డీఆర్ శివలీల తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం, ట్రాక్టర్ ఢీ

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ను డీసీఎం ఢీకొన్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం బస్సాల్ చెర్వు గ్రామానికి చెందిన రాములు ట్రాక్టర్‌తో వ్యవసాయ పొలానికి వెళ్తుండగా అదేసమయంలో ఎర్రవల్లి నుంచి గద్వాల వైపుకు వస్తున్న డీసీఎం ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ రెండు విడిభాగాలుగా విడిపోయింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం గ్రామానికి చెందిన పరమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఔషధాల కోసం, కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతుండటంతో తోటి స్నేహితులు 2008–2009 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం రూ.40,000 ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేవుని చిత్తానుసారం జీవించాలి



ధరూరు: ప్రతి ఒక్కరూ దేవుని చిత్తానుసారంగా జీవించాలని రెవ పాస్టర్ నరేష్‌పాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు ప్రభువు బోధనలు అందరికి ఆదర్శమన్నారు. తోటివారిపై కరుణ, ప్రేమ చూపించాలన్నారు. సమాజంలో యువత అనేక రుగ్మతలకు లోనవుతోందని, యువకులు సన్మార్గంలో నడవాలని కోరారు. అనంతరం బల్లారాధన కార్యక్రమం నిర్వహించి ప్రభు సంస్కార (సహ పంక్తి)భోజనం చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సత్యన్న, సైదన్న, సీమోను, డేవిడ్, దానియేలు, యోబు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ పట్టివేత

ఉండవెల్లి: కర్నూల్ జిల్లా దేవమాడ నుంచి అలంపూర్ చౌరస్తాకు ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్ మండలంలోని బైరాపురం శివారులో బ్లూకోర్టు పోలీసుల తనఖీలో ఆదివారం పట్టుబడిందని ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైన అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

రాజోళి: అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠినం చర్యలు తీసుకుంటామని ఆదివారం తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పనుల కోసమని తుంగభద్ర నది నుంచి ఇసుక తీస్తున్నారని, దీనికోసం అనుమతులు ఇచ్చామని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో ఇసుకను తరలించొద్దని ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కోయిల్‌దిన్నెలో ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. మొత్తం 41 మంది సభ్యత్వం తీసుకున్నారని నాయకుడు గజేంద్రగౌడ్ పేర్కొన్నారు. తెలుగుదేశంలో హయాంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో సూర్యకాంతరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా..

- నత్తనడకన సుందరీకరణ పనులు
- మున్సిపాలిటీకి రూ.5.50 కోట్ల నిధులు



అసంపూర్తిగా ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాలు



నిర్మాణ దశలో ఉన్న డివైడర్ పనులు

అయిజ: మున్సిపాలిటీ సుందరీకరణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పట్టణాలలో అభివృద్ధి పనులు వేగంగా నిర్వహించేందుకు నిధులు కేటాయించింది. అయిజ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.5.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రోడ్డును విస్తరణ చేసి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా సెంట్రల్ లైటింగ్ పనులకు రెండు సంవత్సరాల కిందట శ్రీకారం చుట్టారు. పాతబస్టాండ్ సర్కిల్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు, రాయచూర్ రోడ్డు సర్కిల్ నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్డును 100 అడుగుల వరకు విస్తరించారు. మధ్యలో డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్‌ను అమర్చే పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండు సంవత్సరాల కిందట పనులు ప్రారంభించినా ఇప్పటికీ పూర్తికాలేదు. పనులు నత్తనడకన సాగుతుండడంతో ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతుందని వాహనదారులు వాపోతున్నారు.

ప్రత్యామ్నాయం చేపట్టని కాంట్రాక్టర్‌లు

డివైడర్ నిర్మాణ పనుల కోసం ఇసుక, కంకర, రాళ్లను రోడ్డుపై కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వేస్తున్నారు. వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అధికారులు చొరవ తీసుకొని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



పట్టణంలో నిర్మిస్తున్న సెంట్రల్ లైటింగ్, రోడ్డు డివైడర్ పనుల వలన తరుచూ ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు కూడా చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య నుంచి బయట పడేందుకు అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి.

– శేషగిరి రావు, అయిజ

ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలి



పట్టణంలో ట్రాఫిక్ పోలీసులను నియమించాలి. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. రోడ్డు డివైడర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోజురోజుకు ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. సెంట్రల్ లైటింగ్, రోడ్డు డివైడర్ పనులు త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– మహబూబ్ బాషా, అయిజ

నెలాఖరుకు పూర్తి చేస్తాం



సెంట్రల్ లైటింగ్ పనులు ఈనెల చివరినాటికి పూర్తి చేస్తాం. కొన్ని రోజుల నుంచి రోడ్డు డివైడర్ పనుల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. పనులు చివరిదశకు చేరాయి. రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– నర్సయ్య, మున్సిపల్ చైర్మన్

పట్టణ అభివృద్ధికి కృషి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ

అలంపూర్ రూరల్: పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ అన్నారు. ఆదివారం పట్టణంలో చేపట్టిన రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. 7వ వార్డులో జూనియర్ కళాశాల వెనుక, పోస్టాఫీస్ దగ్గర చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆమె వెంట నాయకులు అక్బర్, సురేష్, వెంకటేష్, అచ్చన్న తదితరులు ఉన్నారు.

లాడ్జ్‌లో ఆకస్మిక తనిఖీ



గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో ఉన్న పలు లాడ్జ్‌లలో పట్టణ ఎస్ఐ రామస్వామి, సిబ్బంది ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు అనుమతి, అపరిచితులకు అద్దెకు ఇవ్వొద్దని సూచించారు. పూర్తి వివరాలు సేకరించిన తర్వాతే అద్దెకు ఇవ్వాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా పోలీసులు తనిఖీలు చేపడుతున్నట్లు సమాచారం తెలుసుకొని కొందరు లాడ్జిలకు తాళాలు వేసి వెళ్లినట్లు సమాచారం. తనిఖీల్లో పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్ షూకుర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో..



గురువులతో పూర్వ విద్యార్థులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంబురపడ్డారు. ప్రతి ఒక్క విద్యార్థి తీపి జ్ఞాపకాలను చెప్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, దేవన్న, లక్ష్మీనారాయణ, ఎండీ పాషా, ఎస్ వెంకటస్వామి, ఆదర్శ సంఘం అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయురాలు ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ప్రభుత్వంతో అలుపెరుగని పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లక్ష్మణగౌడ్, ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి, శివన్న, పరశురాం, ఆకాష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదాం



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న శాంతినగర్ సేవాసమితి సభ్యులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదామని శాంతినగర్ సేవాసమితి, వడ్డేపల్లి సభ్యులు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యులను పట్టణ సేవాసమితి సభ్యులు సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సప్తగిరి శ్రీనివాసులు, సభ్యుడు రమేష్, హోటల్ విజయ్, సుబ్బయ్య, వీరశేఖర్‌లను పూలమాలలు, శాలువాలతో సన్మానించి వినాయక చిత్రపటాలను బహూకరించారు. వాసవీ క్లబ్ ద్వారా చేపట్టే సేవకార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీలో భాగంగా బట్ట సంచులను సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో షేక్ అస్లాంషరీఫ్, రమేష్, మాలిక్, దుబాయ్ శ్రీనులు పాల్గొన్నారు.

పొట్టేళ్ల పోటీలు



ఉండవెల్లి: మండలంలోని తక్కశిల తిరునాళ్ల సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టేళ్ల పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలకు 9 పొట్టేళ్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పాల్గొన్నాయి. కర్నూల్ జిల్లా, తాండ్రపాడు గ్రామానికి చెందిన పొట్టేళ్లు మొదటి, రెండో స్థానంలో నిలిచాయి. మారమునగాల గ్రామానికి చెందిన పొట్టేలుకు మూడో బహుమతి దక్కింది. మొదటి బహుమతి రూ.10,116, రెండో బహుమతి రూ.5,116 అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



అమరవాయి వద్ద రోడ్డు పక్కన ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. రైతు వ్యవసాయ పొలాల పక్కన, రోడ్లకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని రైతులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అమరవాయి, మల్దకల్, బిజ్వారం, తాటికుంట, నాగర్‌దొడ్డి, నీలిపల్లి గ్రామాల్లో ఇళ్లకు దగ్గరగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారు. అదే విధంగా అమరవాయి, బిజ్వారం, మల్దకల్ గ్రామ ప్రధాన రహదారుల పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ఎప్పుడు రద్దీగా ఉండే ఈ రోడ్లపై వాహనాలు ఢీకొని ప్రమాదం జరిగిన సంఘటనలు ఉన్నాయి. అయిజ – గద్వాల ప్రధాన రహదారిలోని అమరవాయి చింతలముని స్వామి ఆలయ సమీపంలో రోడ్డుకు సమీపంలోట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో వ్యవసాయ పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో రైతు గోవిందు అనే వ్యక్తి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే పశువులు విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. వేలాడు విద్యుత్ తీగలతో పాటు రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మరో చోటుకు మార్చాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అసెంబ్లీ సెక్రెటరీకి సన్మానం



ఉండవెల్లి: రాష్ట్ర అసెంబ్లీ సెక్రెటరీ నరసింహ ఆచారిని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం సన్మానించారు. ఆదివారం అలంపూర్ జోగులాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్తుండగా మార్గమధ్యలో మండల కేంద్రంలోని అలంపూర్ చౌరస్తా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం స్థానికులతో సమస్యల అడిగి తెలుసుకున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బీసీ కాలనీలో వార్డు కౌన్సిలర్ జయమ్మకోటేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కృషి, పట్టుదల ఉంటే విజయాలు సాధ్యమన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బీసీ కాలనీ 8వ వార్డులో చేపట్టిన వెంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహ నూతన ఆలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం పండితుల శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని కోరారు. అనంతరం కాలనీలో నిర్మాణ దశలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, జెడ్పీటీసీ రాజశేఖర్, ఎంపీపీ విజయ్‌కుమార్, కౌన్సిలర్లు జయమ్మ, నాగిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కేటేష్, గోవిందు, ధర్మనాయుడు, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న నిర్వాహకులు

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయి రామాలయంలో సీతారాములు, హనుమంతుడు విగ్రహాలతో పాటు బొడ్రాయి, ధ్వజస్తంభానని ఆదివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రాతకాల పూజ, యంత్ర ప్రతిష్ఠ హోమం, శాంతి పౌష్టిక, మూలమంత్ర హోమం, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణహూతి, కుంబాభిషేకం పూజ కార్యక్రమాలను నిర్వహించారు. సర్వ దర్శనం, ఆశీర్వచనం, మహా నైవేద్యం, మంగళహారతి ఇచ్చారు. గ్రామంలో భక్తుల సందడి కనిపించింది. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'స్లోబైక్' రేస్



పెద్ద ధన్వాడలో స్లోబైక్ రేస్‌లో పాల్గొన్న యువకులు



తక్కశిలలో..

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణ ఉత్సవాలలో భాగంగా స్లోబైక్ రేస్, ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలను నిర్వహించారు. ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలో మొదటిస్థానంలో లక్ష్మన్న నిలిచి రూ. 5016 కైవసం చేసుకున్నారు. రెండో స్థానంలో వీరేష్ నిలిచి రూ.3016లు అందుకున్నాడు. మూడో స్థానంలో నిలిచిన గోవర్ధన్‌కు రూ.2016 నగదు బహుమతి అందజేశారు. స్లోబైక్ రేస్ పోటీల్లో మొదటి విజేత అశోక్ రూ.3016లు, రెండోస్థానంలో శివారెడ్డి రూ.2016, మూడో స్థానంలో కటిక హుస్సేన్‌కు రూ.1016లు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో స్లో బైక్ రేస్ పోటీలను ఆదివారం నిర్వహించారు. దాదాపు 60 మంది యువకులు పాల్గొన్నారు. బుడమర్సుకు చెందిన సతీష్ మొదటి బహుమతి, రెండో బహుమతి బొరవెల్లి ఆనంద్, మూడో బహుమతి ప్రదీప్ గెలుచుకున్నారు. విజేతలను నిర్వాహకులు అభినందించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దులు

ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో నాలుగు పల్లు బండలాగుడు (పాలబండ) పోటీలను నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన పాలబండ పోటీలకు 10 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీలను ఎస్ఐ బాల్‌రాజు ప్రారంభించి మాట్లాడారు. పోటీలతో రైతుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి రైతులు తరలివచ్చారు. మొదటి విజేత కర్నూల్ జిల్లా పంచలింగాలకు చెందిన బైర పోగు బుల్స్ ఎద్దులు నిలిచాయి. రెండోస్థానంలో ఆదవన్నే రాజోలికి చెందిన ఎద్దులు, మూడో బహుమతి బసగానపల్లెకు చెందిన రామకృష్ణ, నాలుగో బహుమతి కల్లుపల్లికి చెందిన షేక్ మైమున్న మలల్లా, ఐదోస్థానంలో బీఎల్‌కే బుల్స్ నిలిచారు. విజేతలను బహుమతులు ఎస్ఐ అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు పాల్గన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీమాత ఉత్సవాలు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: చౌడేశ్వరీమాత ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఆత్మకూర్ మండలపరిధిలోని తిప్పడంపల్లిలో పద్మశాలీల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. గ్రామ శివారులోని చౌడేశ్వరీమాత ఆలయం వద్ద ప్రముఖ వేదపండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ఠ 40వ వార్షికోత్సవం సందర్భంగా 13 భారీ జ్యోతులతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు, అమ్మవారికి గంగపూజ, అభిషేకం, ఎదుర్కోళ్లు, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు



మస్తీపురం శివారులో కోతకు గురైన రహదారి



మస్తీపురం గ్రామంలో..

అమరచింత: మండలంలోని పలుగ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు దెబ్బతినడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారి అధ్వానంగా మారినా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదంటున్నారు. జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారిని కృష్ణా పుష్కరాల సమయంలో పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. అదేవిధంగా మస్తీపురం ఎక్స్‌రోడ్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు బీటీ రహదారిని పూర్తిచేసినా, మిగిలినా దారిని విస్మరించారు. దీంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రహదారి అధ్వానంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తిచేసి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



జూరాల ప్రాజెక్టు రోడ్డుపై ఏర్పడిన గుంత